## డా॥ రాజారావుపై అక్రమ కేసును నిరసిస్తూ ఆందోళన

## భయోత్పాతం సృష్టించిన పోలీసులు

**పొన్నూరు, 10-10-16 :**

ప్రజావైద్యశాల నిర్వాహకులు, పౌరహక్కుల సంఘం నాయకులు డా॥ టి.రాజారావుపై పోలీసు అధికారులు అక్రమంగా బనాయించిన తప్పుడు కేసును రద్దుచేయాలని, ఆయనపై వేధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్‌చేస్తూ 'పౌర, మానవహక్కుల సంఘాలు, ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు, ప్రజలతో ఏర్పడిన ఐక్యకార్యాచరణ వేదిక-పొన్నూరు' ఆధ్వర్యంలో, వేదిక పిలుపుమేరకు అక్టోబర్ 10వ తేదీన పొన్నూరు తహశీల్‌దారును కలసి విజ్ఞాపన పత్రం ఇవ్వాలని 'చలో పొన్నూరు' కార్యక్రమం నిర్ణయించారు.

ఈ పిలుపును అమలుకానీయకుండా భయోత్పాతం సృష్టించటానికే పోలీసు అధికారులు నిశ్చయించుకున్నారు. ప్రజావైద్యశాల నిర్వహిస్తున్న డా॥రాజారావు ఇంటిని, వైద్యశాలను పోలీసులు చుట్టుముట్టి అటువైపు దారితీసే రహదార్లన్నంటినీ దిగ్బంధనం చేశారు. పదవతేదీ ఉదయం నుండే అటువైపుగా ఎవ్వరినీ వెళ్ళనీయకుండా, పొన్నూరులో సెక్షన్ 144, సెక్షను 30 అమలులో వుందంటూ అన్ని ప్రధానకూడళ్ళలో స్థానిక పోలీసులతో పాటు, ప్రత్యేక పోలీసులు, యాంటీనక్సల్ బలగాలు - మొత్తంగా వందలాదిమంది పోలీసులను మోహరించటంతో పట్టణంలో భయానక వాతావరణం ఏర్పడింది. అనేక వ్యాపార, వాణిజ్య షాపుల యజమానులు తమ షాపులను మూసివేసుకొని వెళ్ళారంటే పోలీసుల మోహరింపు తీవ్రత అర్థమౌతుంది.

పోలీసుల దిగ్బంధాన్ని ఛేదించుకుని డా॥ రాజారావుగారి ప్రజావైద్యశాల వద్దకు చేరుకున్న వివిధ పార్టీల నాయకులు, కార్యాచరణ వేదిక ప్రతినిధులు మరియు అక్కడికి చేరుకున్న కొందరు ప్రజలతో కలసి 10వ తేదీ ఉదయం 10 గంటలకు తహశీల్‌దారుకు విజ్ఞాపనపత్రం ఇచ్చేందుకు ప్రదర్శనగా బయలు దేరారు. పోలీసు అధికారులు ప్రదర్శనకు అనుమతి లేదంటూ వారిని నిలిపివేశారు. సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥గుర్రం విజయకుమార్, నల్లమడ రైతుసంఘం నాయకులు డా॥ కొల్లా రాజమోహన్, హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకులు జి.ఎస్.రాయల్, గోగినేని పరశురామయ్య, రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కామ్రేడ్స్ ఎస్. లక్ష్మారెడ్డి, పాటిబండ్ల కోటేశ్వరరావు, ఎం.శోభ మరియు డా॥ రాజారావు తదితరులు పోలీసు అధికారులను గట్టిగా నిలవేయటంతో తీవ్ర వాగ్వివాదం అనంతరం పోలీసు అధికారులు ఒక అడుగు వెనక్కి వేయక తప్పలేదు. 'గ్రీవెన్స్ సెల్' నిర్వహిస్తూ ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలను స్వీకరిస్తున్న పొన్నూరు తహశీల్‌దారునే ప్రజావైద్యశాలవద్దకు రప్పిస్తామని, అక్కడే విజ్ఞాపక పత్రం ఇవ్వవలసిందిగా కోరి, తదనుగుణంగా తహశీల్‌దారును ఆఘమేఘాలమీద రప్పించారు. తహశీల్‌దారు ప్రజావైద్యశాలవద్దే విజ్ఞాపన పత్రం తీసుకున్నాడు.

ఇదే సమయంలో మరికొందరు ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు తహశీల్‌దారు కార్యాలయం వద్దకు చేరుకోగా, వారిని కలుసుకునేందుకు అక్కడికి వెళ్ళిన డా॥ రాజారావు వారితో కలిసి మరో పర్యాయం మెమోరాండం సమర్పించి వెనుదిరుగుతుండగా, పోలీసులు వారిని నిరోధించి డా॥రాజారావును వేరుచేసి అజ్ఞాత ప్రదేశానికి తరలించారు - మరో 20 మందిని అరెస్టు చేసి వేరు వేరు పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించారు. దీనితో డా॥రాజారావు భార్య శ్రీమతి సుమతి ప్రజా వైద్యశాల ఎదుట బైఠాయించి పోలీసుల తీరును నిరసించారు. పోలీసులపై ప్రైవేటు కేసు వేయటాన్ని సహించలేక డా॥ రాజారావుపై తప్పుడు కేసు బనాయించటమే గాక, భయోత్పాతం సృష్టించేందుకు ప్రయత్నించిన పోలీసు అధికారుల చర్యలను ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా గర్హించారు. విధులు నిర్వహించకుండా పోలీసు అధికారులను అడ్డుకున్నారని, విధి నిర్వహణలోని మహిళా కానిస్టేబుల్‌ను గాయపరిచారని ఆరోపిస్తూ అరెస్ట్ చేసిన వారిపై పోలీసు అధికారులు కేసు నమోదుచేసి, స్టేషన్‌బెయిల్‌పై 10వ తేదీ రాత్రి విడుదల చేశారు.

oooo